నవతెలంగాణ

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం 19 ఫిబ్రవరి 2023



ఎన్ఐఎన్‌ను సందర్శించిన ఫార్మసీ విద్యార్థులు



నవ తెలంగాణ - పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)లోని యానిమల్ ఫెసిలిటీ ల్యాబ్‌ను సందర్శించారు. జంతువుల కోసం ఎన్ఎన్ఎ నెలకొల్పిన సౌకర్యాలు, నిర్వహణ తీరు తెన్నులు, వాటికి నిర్వహించే పరీక్షలు, ప్రీ-క్లినికల్ అధ్యయనాలు వంటి పలు అంశాలను విద్యార్థులకు శాస్త్రవేత్తలు వివరించారు. జంతువుల నిర్వహణపై జరిగిన కార్యశాలలో గీతం ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఏర్పాటు చేసిన జంతు గృహ సౌకర్యాలు, ప్రయోగాల కోసం ఆ సముదాయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల జంతువులు, వాటికి దాణా తయారీ విధానంతో పాటు పలు విషయాలను ఎన్ఐఎన్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు.

ఘనంగా మహాశివరాత్రి పండుగ



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంతో పాటు మండలంలోని గొట్లమిట్ట, వరికోలు, రాంచంద్రాపూర్, శనిగరం, కూరెళ్ళ తదితర గ్రామాలలో మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాలలోని శివాలయాలలో శివరాత్రి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గొట్లమిట్ట లింగేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి దంపతులు, మాజీ హౌజ్‌ఫెడ్ ఛైర్మన్, బిజెపి నియోజకవర్గ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, వరికోలు శివాలయంలో కిమ్స్ విద్యాసంస్థల ఛైర్మన్ పెర్యాల రవీందర్‌రావు కుటుంబ సభ్యులు, ఏబిఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి హుజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శివ భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఖాకీల కాఠిన్యం



- దొంగతనం నెపంతో చావగొట్టారు
- సచ్చినా కేసు పట్టని వైనం.. సెటిల్‌మెంట్
- ఖదీర్‌ఖాన్ మృతి ఘటనపై సమగ్ర విచారణ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'లాఠీలకు కాఠిన్యమున్నా ఖాకీలకు కనికరముంటది' అనే నానుడి. కొందరు ఖాకీలు మాత్రం తమకు కాఠిన్యమే ఉందని రుజువు చేస్తున్నారు. ఓ దొంతతనం కేసులో విచారణ నిమిత్తం తీసుకొచ్చిన వ్యక్తిని చావకొట్టారు. కేసును నీరుగార్చారు. ఉన్నతాధికారే సెటిల్‌మెంట్ చేసి ఫ్రెండ్లీ పోలీస్ అనే పదానికి కొత్త అర్థం చెప్పారు. మరో దొంగతనం కేసులో ఓ వ్యక్తిని కొందరు కొట్టిచంపినా కేసు చేయలేదు. సెటిల్‌మెంట్లు, వసూళ్ల దందాలకు నిలయాలుగా ఠాణాలు మారాయనే విమర్శ సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఫ్రెండ్లీ పోలీస్ నినాదానికి భిన్నంగా కొందరి పోలీసుల వ్యవహార శైలి ఉందనే చర్చ ఉంది. వ్యవస్థనంతా తప్పుపట్టలేం కానీ.. కొందరి ప్రవర్తన పోలీస్ శాఖకే మచ్చ తెస్తోంది. ఫిర్యాదుదారులపై చేయి చేసుకోవడం, విచారణ పేరిట పిలిచి నానా బూతులు తిట్టడం, లాఠీలకు పనిచెప్పి చితకబాదడం, బాధితుడైనా నింధితుడైనా డబ్బులిస్తేనే పని చేయడం అనేవి సర్వసాధారణంగా మారాయనే విమర్శ ఉంది. కొన్ని సంఘటనలపై విమర్శలకు ఆజ్యం పోస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన ఖదీర్‌ఖాన్ మృతి సంఘటన వెనకాల ఏం జరిగిందనే విషయాలపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ ఉంది. ఉన్నతాధికారులు నిజాలను నిగ్గుతేల్చేలా నిష్పక్షపాతంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మానవహక్కుల సంఘాలు కోరుతున్నాయి.

ఖదీర్‌ఖాన్ చావుకు కారణమేంటి?

మెదక్ జిల్లా పిట్లంబేస్‌కు చెందిన మహ్మద్ ఖదీర్‌ఖాన్ నిరుపేద. అతనికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. మెదక్ పట్టణంలో ఓ మహిళ తన మెడలో ఉన్న బంగారు గొలుసును ఎవరో దొంగిలించారంటూ ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీని పరిశీలించిన ఐడీ పార్టీ పోలీసులు ఖదీర్‌ఖాన్‌ను అనుమానిత వ్యక్తిగా భావించారు. ఆ సమయంలో హైదరాబాద్‌లో బంధువుల ఇంట్లో ఉన్న ఖదీర్‌ఖాన్‌ను అదుపులో తీసుకున్న పోలీసులు కారులో తీసుకొస్తూ విపరీతంగా కొట్టారు. విచక్షణారహితంగా తన్నారు. పోలీస్ స్టేషన్‌కు గత నెల 29న తీసుకొచ్చి ఫిబ్రవరి 2న వదిలేశారు. ఆ మూడు రోజులు నేరం అంగీకరించాలంటూ ఖదీర్‌ను విపరీతంగా కొట్టారు. చావు దెబ్బలు తిన్నప్పటికీ తాను దొంగతనం చేయలేదంటూ ఖదీర్ వేడుకున్నాడు. అయినా సరే కొట్టడడంతో రెండు చేతులు సచ్చుబడిపోయాయి. కిడ్నీలు దెబ్బతిన్నాయి. అయినా పోలీసులు అతన్ని వదల్లేదు. పరిస్థితి చేజారి పోతుందని గమనించిన పోలీసులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఖదీర్‌ను వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఖదీర్‌ఖాన్ మృతి చెందాడు. దీంతో పోలీసులు కొట్టడం వల్లనే రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని, చేతులు సచ్చుబడ్డాయని, విపరీతంగా కొట్టడం వల్లనే తన భర్త చనిపోయాడంటూ ఖదీర్‌ఖాన్ భార్య సిద్దేశ్వరీ శుక్రవారం మెదక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వరకు కేసు పెట్టకుండా సెటిల్‌మెంట్ చేసేందుకు ప్రయత్నించారు. కొందరు పెద్దమనిషులు, పోలీస్ భాస్ కలిసి సెటిల్‌మెంట్ చేశారు. దెబ్బలు కొట్టిన ఐడీ పార్టీ పోలీసులు పవన్, ప్రశాంత్‌తో పాటు ఎస్ఐ ఇతర అధికారులపై 302 సెక్షన్ కింద కేసులు కాకుండా పిటీ కేసు అయ్యేలా చూశారు. సచ్చేలా కొట్టకపోతే మృతుడి భార్యకు భారీ మొత్తం ఇవ్వడానికి ఎందుకు సిద్ధపడ్డట్టు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి కరెంట్ మోటార్ల వైర్లు దొంగిలిస్తుండగా పట్టుకున్న రైతులు అతన్ని కొట్టి చంపారు. ఆ విషయంలో కేసు కాకుండా పోలీసులు సహకరించారు. వీటిపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

సంగారెడ్డిలోనూ..

సంగారెడ్డి పట్టణ సమీపంలో డిసెంబర్ 14న సుల్తాన్‌పూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎర్రోళ్ల శ్రీను అనే యువకుడు బైక్‌పై నుంచి పడి గాయాలపాలయ్యాడు. అతన్ని 108లో సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స చేసి సంగారెడ్డి పోలీసులకు సమాచారమిస్తే తమ పరిధి కాదన్నారు. పుల్కల్ పోలీసులకు చెబితే స్పందించనేలేదు. ఆ యువకుడు 14 రోజుల తర్వాత చనిపోయాడు. అయినా పుల్కల్ పోలీసులు పట్టించుకోలేదు. ముందే పోలీసులు స్పందించి కేసు విచారిస్తే యువకుడి బంధువులకు సమాచారం తెలిసేది. మెరుగైన వైద్యం అందితే బతికే అవకాశముండే.

ఏడుపాయల జాతరను ప్రారంభించిన మంత్రి




నవతెలంగాణ-పాపన్నపేట

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడు పాయలలో మహా శివరాత్రి జాతరను శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి హరీశ్‌రావు మెదక్, నర్సాపూర్ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు వనదుర్గా భవానీ మాతకు పట్టు వస్త్రాలు సమ ర్పించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పువ్వులతో అందంగా అలంకరించారు. వనదుర్గా భవానీ మాత విశేష అలంకరణతో భక్తుల కు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఏడుపా యల ప్రాంగణం సందడిగా మా రింది. పూజారులు అమ్మవారిని పట్టుచీర, బంగారు కిరీటం, హారాలు, ముక్కుపుడ కతో అలంకరించారు. గజమాలలు, గులాబీ పువ్వుల అలంకరణతో అమ్మవారి రూపం ఎంతో ఆకర్షణీయంగా భక్తులకు దర్శనమిచారు. తెల్లవారుజాము అమ్మవారికి అభిషేకం అలంకరణ చేసి అర్చన నిర్వహించి జాతర వేడుకలకు ఆలయ అర్చకులు శ్రీకారం చుట్టారు. ఓవైపు శివనామస్మరణతో మరోవైపు దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాల ఆలయం మార్మోగింది. ఆలయ మండపాన్ని, ప్రాంగణాన్ని, ధ్వజస్తంభాన్ని రంగు రంగుల పువ్వులతో అలంకరించారు. రాజగోపురం నుంచి ఆలయానికి వెళ్లే దారిలో ఆకట్టుకునేలా అరటి కొమ్మలు కమాన్ ఏర్పాటు చేశారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి గర్భగుడి ఎదుట మంజీర నది పాయ మధ్యలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శు భాకాంక్షలు తెలిపారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రరమేష్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈ ఓ శ్రీనివాస్, ఆర్.డి.ఓ సాయి రామ్ పాల్గొన్నారు.

జాతరలో ఫ్లెక్సీవార్

ప్రొటోకాల్ పాటించలేదని ఆలయ చైర్మెన్, అధికారులపై ఎమ్మెల్యే ఫైర్



నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలలో భాగంగా శనివారం జ హీరాబాద్ శాసనసభ్యులు మా ణిక్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ కమాన్ ముందు భాగం నుంచి గోపురం వరకు ప్రదర్శించిన ఫ్లెక్సీలను ఆయన పరిశీలించారు. వీటిలో సరైన ప్రొటోకాల్ ప్రకారం ఫొటోలను ఎందుకు ప్రదర్శించలేదని ఆలయ ఈవో, చైర్మన్, ఆలయ జూనియర్ అసిస్టెంట్‌లపై ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, తప్పులు మరోమారు చేయరాదని హెచ్చరించారు.

రేపు బర్దీపూర్ రానున్న బండి సంజయ్

ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ గ్రామంలో గల శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమానికి సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ రానున్నట్లు ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, శ్రీ సిద్ధేశ్వరానందగిరి మహరాజ్, దత్తగిరి మహరాజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం పేర్కొన్నారు. ఆశ్రమంలో జరుగుతున్న శ్రీ దత్తగిరి మహరాజ్ శత జయంతి ఉత్సవాలకు ఆయన హాజరుకానున్నట్లు తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన దేవాలయాలు









నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో గల శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శివనామస్మరణతో దేవాలయాలన్నీ మారుమోగాయి. మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల రెండో రోజు శనివారం ఉదయం నుంచి అభిషేకాల కోసం భక్తులు బారులు తీరారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పేల హరనాథ్ శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రీ టౌన్ సిఐ భాను ప్రకాష్ క్షేత్రాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రుద్రేశ్వరాలయంలో వి.హనుమంతరావు ప్రత్యేక పూజలు

కొండపాక రుద్రేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. రుద్రేశ్వరునికి ఉదయం నుంచి భక్తులు అభిషేకం నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు హనుమంతరావు ఆలయాన్ని దర్శించుకుని అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దుల సోమేశ్వర్ రెడ్డి తదితరులు పూజలు చేశారు. అలాగే డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సర్పంచ్ మాధురి దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని దుద్దెడ స్వయంభూ శంభో దేవాలయం, కుకునూరుపల్లి ఉమామహేశ్వర దేవాలయం సిరసనగండ్ల శివాలయంలో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మరవద్దు

నవతెలంగాణ-కొండపాక

పదవులు, అధికారం, హెూదా ఏవీ శాశ్వతం కాదని, పుట్టి పెరిగిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం మరువకూడదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు అన్నారు. శనివారం కొండపాకలోని రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించిన మదన్మోహన్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకోవాలని కోరారు. భావితరాలకు మదన్మోహన్ చేసిన సేవలను గుర్తుగా సిద్దిపేటలో విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, మంత్రులు, సీఎంలు ఇలా పదవులు వచ్చినప్పటికీ పుట్టి పెరిగిన గ్రామాన్ని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే తపన ప్రతి ఒక్కరికి ఉండాలన్నారు. అలాంటప్పుడే మన జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. మదన్ మోహన్ కుటుంబం ఎంతోమందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన సోదరుడు శ్యామ్మోహన్ గ్రామంలోని రుద్రేశ్వర ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామస్తుల సహకారంతో పూర్వ వైభవం తీసుకువచ్చారన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో టీపీసీసీ క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ అనంతుల శ్యామ్ మోహన్, టీపీసీసీ సభ్యుడు సీనియర్ నాయకులు గంప మహేందర్ రావు, సోమేశ్వర్ రెడ్డి , ఉమాదేవి, కొండపాక, కుకునూరుపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విరుపాక శ్రీనివాస్ రెడ్డి, లింగారావు, దాస వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొమురవెల్లి: మహాశివరాత్రి సందర్భంగా మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగాయి. గర్భాలయంలో స్వామివారికి నిరంతరంగా మహన్యాస పూర్వక అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మహాశివరాత్రి రోజు రాత్రి దేవస్థానం ఆధ్వర్యంలో లింగోద్భవ కాలంలో నిర్వహించే పెద్ద పట్నం కార్యక్రమాన్ని చూసేందుకు వేలాది మంది తరలి వచ్చారు. రాత్రంతా జరిగే మహోత్సవాన్ని చూసేందుకు మధ్యాహ్నం నుంచే భక్తులు రావడం మొదలుకావడంతో ఆలయ పరిసారాలు కోలాహలంగా మారాయి. రాజగోపురం నుంచి ప్రధాన రహదారి, గంగరేణి చెట్టు వద్ద సందడి నెలకొంది. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు బారులుదీరారు. అనంతరం కొండ పైన వెలసిన రేణుక ఎల్లమ్మ దేవతను దర్శించుకునేందుకు నెత్తిన బోనాలతో వెళ్ళారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈఓ బాలాజీ, ధర్మకర్తల మండలి చైర్మన్ గీస భిక్షపతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అడిషనల్ డిసిపి మహేందర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, స్థానిక ఎస్సై చంద్రమోహన్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శనివారం మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి దర్శించుకున్నారు . ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాన్ని అందించారు. ఆలయ ఈవో బాలాజీ, హుస్నాబాద్ఏసిపి సతీష్, ఎస్సై చంద్రమోహన్ యాదవ్,



ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-చేర్యాల : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం చేర్యాల పట్టణ కేంద్రం తో పాటు మండలంలోని గ్రామాల్లో ఆలయాలన అలంకరించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఉదయం నుండే భక్తులు రుద్రాభిషేకాలు, మహాలింగార్చన, దీపోత్సవం, లింగోద్భవం చేసి అభిషేకాలతో స్వామివారికి కల్యాణం నిర్వహించారు.

నవతెలంగాణ-తొగుట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో శైవక్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మాధవానంద సరస్వతి స్వామి, మధుసూధనానంద సరస్వతి స్వామివారి ఆధ్వర్యంలో మధనానంద శారదా క్షేత్రంలో ఉదయం నుంచి అఖండ భజన, అభిషేకం కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయంలో లింగేశ్వర స్వామికి జలాభిషేకం, శనేశ్వరునికి తైలాభిషేకం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగాయని, లింగోద్భవ కాలంలో స్ఫటిక లింగేశ్వర స్వామికి మాధవానంద సరస్వతి స్వామి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, ప్రముఖులు ఆలయంలో స్ఫటిక లింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం కార్యక్రమం నేత్ర పర్వాంగా కొనసాగింది. వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటలాడింది. శివరాత్రి పర్వదిన సందర్భంగా శైవ క్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాపకు ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావు



నవతెలంగాణ-రామాయంపేట

తక్కువ బరువు, అ నారోగ్యంతో జన్మించిన పాపకు శ్రీ రాజరాజేశ్వరి పిల్లల ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ప్రదీప్ రావు ప్రా ణం పోశారు. కామారెడ్డి జిల్లా సంగమేశ్వర్ గ్రామానికి చెందిన స్వప్న ఏడు రోజుల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నెలలు నిండక ముందే ప్రసవించి ఆడపిల్లకు జన్మనిచ్చింది. నెలలు నిండకముందే ప్రసవించడంతో కేవలం 1.2 కేజీల బరువు మాత్రమే ఉంది. అనారోగ్యంతో ఉన్న పసిపాపను పట్టణంలోని రాజరాజేశ్వరి చిన్నపిల్లల దవాఖానలో చేర్పించారు. ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ప్రదీప్ రావు ప్రత్యేక చికిత్స అందించి పాప ప్రాణాలు కాపాడారు. ఆరోగ్యంగా తయారైన బేబీని శనివారం ఇంటికి పంపించారు. పాపకు ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావుకు, ఆసుపత్రి సిబ్బందికి స్వప్న దయాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ సాయిబాబా దేవాలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్ర త్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక కమిటీ ప్రధాన కార్యదర్శి పెంటి కిషన్ నేత తెలి పారు. ఆలయంలో శివుడికి అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం శావా ఊరేగింపు నిర్వహించినట్లు వెల్లడించారు. ఉపవాసాలున్న భక్తులకు పండ్లు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

శివుడి అనుగ్రహంతో ని యోజకవర్గ ప్రజలంతా సుభి క్షంగా ఉండాలని దుబ్బాక ఎ మ్మెల్యే రఘునందన్ రావ్ అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి గ్రామంలోని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లయ రూపురేఖల మార్పునకు సహకరిస్తున్న ఇక్కడి ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో నివాస గుడిసె దగ్ధం



నవతెలంగాణ-మిరుదొడ్డి

షార్ట్ సర్క్యూట్‌తో నివా స గుడిసె దగ్ధమైన సంఘ టన సిద్దిపేట జిల్లా మిరు దొడ్డి మండలం పెద్ద చెప్యా ల గ్రామంలో చోటు చేసు కుంది. గ్రామానికి చెందిన ఘటన పోచయ్య గత కొన్ని సంవత్సరాలుగా పూరి గుడ సెలో నివసిస్తున్నాడు. శనివారం రాత్రి అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒకేసారి మంట రావడంతో పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న బియ్యం, భూమి పట్టా పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకంతో పాటు సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. సుమారుగా రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టమైనట్లు స్థానికులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మినీ స్టేడియం ప్రకటనకు ఆరేళ్లు

- అమలుకునోచుకోని ఎమ్మెల్యే హామీలు
- మినీస్టేడియం కోసం యువత ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో యువకులు, క్రీడాకారులు, స్థానికులు

నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట పట్టణంలో అభివృద్ధి పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. స్థానిక ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అభివృద్ధి పనులపై ప్రకటనలు చేయడమే తప్ప పనులను పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నిదర్శనం ఆరు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే ఎ ద్మాదేవేందర్‌రెడ్డి రామాయంపేటలో మినీ స్టేడియం ప్రకటన. 2017 ఫిబ్రవరి 11న తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి రూ.2.65 కోట్లతో పట్టణంలో మినీ స్టేడియం నిర్మిస్తున్నామని మీడియా ఎదుట ప్రకటించారు. ఆమె ప్రకటనకు అనుగుణంగా టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. 1421 సర్వే నంబర్‌లో మినీ స్టేడియం కోసం బైపాస్‌లో అయ్యప్ప దేవాలయం పక్కన స్థలం కేటాయించారు. పనులు మాత్రం చేయలేదు. ఎమ్మెల్యే మినీ స్టేడియం నిర్మిస్తామని చెప్పి ఈ నెల 11వ తేదీ వరకు ఆరు సంవత్సరాలు పూర్తయింది. ఆరేళ్ల క్రితమే పనులు ప్రారంభించి భూమి చదును కాకముందే కాంట్రాక్టర్ నిలిపివేశారు. చేసిన పనులకు రూ.40 లక్షల బిల్లులు మాత్రం తీసుకున్నారు.

మినీ స్టేడియం కోసం యువత ఎదురుచూపులు

మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి ఆటలు ఎంతో దోహదపడతాయని సందర్భం వచ్చినప్పుడల్లా పాలకులు చెప్పే మాటలు. అవి మాట వరసకే తప్ప మనసులో నుంచి వచ్చేవి కావని అర్థమవుతోంది. రామాయంపేటలో ఆటల అభివృద్ధికి పాలకులు చేసిన కృషి శూన్యమనే చెప్పొచ్చు. సుమారు నాలుగు ఎకరాలున్న రామాయంపేట కళాశాల మైదానం ఇప్పుడు రెండు ఎకరాలలోపే మిగిలింది. కళాశాల మైదానం స్థలంలో నుంచి పోలీస్‌స్టేషన్, సీఐ, ఎస్ఐ క్వార్టర్స్‌కు కొంత భాగం కేటాయించారు. మరికొంత స్థలంలో కళాశాల భవనం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. దీంతో చిన్నదిగా మారిన కళాశాల మైదానం ఆటలకు అనువుగా లేకుండా పోయింది. ఈ సమస్యను పలు యువజన సంఘాలు, క్రీడా సంఘాలు పాలకుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మినీ స్టేడియం నిర్మిస్తామని, నిధులు కూడా మంజూరు అయ్యాయని ప్రకటించారు. ఉత్సాహంగా ప్రకటన అయితే చేశారు. స్టేడియం నిర్మాణ పనులు మాత్రం చేయించడంలో విఫలమయ్యారు. దీంతో ఆరు సంవత్సరాలుగా స్థానిక యువకులకు, క్రీడాకారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

అన్నింటికీ కాలేజ్ గ్రౌండే దిక్కు

మున్సిపాలిటీగా ఉన్న రామాయంపేటలో సుమారు



25 వేల జనాభా ఉంది. ఇంత జనాభాకు ఉన్నది కేవలం ఒకే ఒక్క కళాశాల మైదానం. అదీ కేటాయింపులకు పోను చిన్నగా కావడంతో యువకులు, క్రీడాకారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్బాల్, హాకీ వంటి అన్ని ఆటలకు కళాశాల మైదానమే దిక్కు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు ఆట మైదానాలు లేకపోవడంతో పరిసర మండలాలు, గ్రామాల నుంచి వచ్చే వేలాది మంది విద్యార్థులకు కూడా కాలేజీ గ్రౌండే దిక్కు అయింది. పోలీసు ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కసరత్తు కోసం వచ్చే వందలాది మంది యువకులకు కూడా కళాశాల మైదానమే ఆశ్రయం ఇస్తుంది. స్థానికులు ఆరోగ్యం కోసం చేసే మార్నింగ్ వాకింగ్‌కు కూడా ఈ మైదానమే ఉపయోగపడుతుంది. యువకులు, క్రీడాకారులు, స్థానికులతో మైదానం ఉదయం సాయంత్రం కిక్కిరిసిపోతుంది. ఎవరు ఏ ఆట ఆడుతున్నారో? ఎవరు ఏ టీంలో ఆడుతున్నారో? ఎవరికీ అంతుపట్టని పరిస్థితి మైదానంలో నెలకొంది. సరిపడా మైదానం లేకపోవడంతో వారందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో దోహదం చేసే మైదానాలను ప్రజాప్రతినిధులు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మినీ స్టేడియం వీలైనంత త్వరగా పూర్తి చేస్తే సమస్యకు కొంత వరకైనా పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్‌లో ఉన్న విధంగా సమయంలోగా పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


నవతెలంగాణ

మినీ స్టేడియం కోసం రూ.2.65 కోట్లు

- డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

బిల్లులు ఆలస్యం అవ్వడంతో కాంట్రాక్టర్ పనుల నిలిపివేత

రామాయంపేట మినీ స్టేడియం టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. నేల చదును చేసిన తర్వాత, రావాల్సిన బిల్లులు ఆలస్యం అవ్వడంతో పనులు నిలిపివేశారు. ఆలస్యంగా బిల్లులు వస్తే ఇకపై పనులు చేయలేనని చేతులెత్తేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకుకు చర్యలు తీసుకుంటాం.

- పాండురంగారెడ్డి, డీఈ

జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-నారాయణఖేడ్

ఖేడ్ నియోజకవర్గంలోని మున్సిపాల్టీ పరిధిలో గల ఎంపీడీవో ఆఫీస్ దగ్గర నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణాలకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్ సారథ్యంలో 116 మంది జర్నలిస్టులకు రూ.6.26 కోట్లతో ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు నిర్మించి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదన్నారు. అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ పట్లోల్ల మంజుశ్రీ జైపాల్ రెడ్డి, కలెక్టర్ శరత్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నాయకులు,స్థానిక జర్నలిస్టులు, జేఏసీ అధ్యక్షులు కులకర్ణి శ్రీకాంత్, రవి, అధ్యక్షులు అమృత్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ 2

సంగారెడ్డి

ఆదివారం 19 ఫిబ్రవరి 2023

చింతా ప్రభాకర్ ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-సదాశివపేట



రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ త్వరగా కోలుకుని.. ఆయురారోగ్యాలతో ఉండాలని బీఆర్ఎస్ మండల పార్టీ తరపున మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు శనివారం మండల ంలోని కంబాలపల్లి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడు తున్న చింతా ప్రభాకర్.. ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని.. దీంతో వారి ఇంటి ఇలవేల్పు అయిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ంలో ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ యాదమ్మ కిష్టయ్య, సర్పంచుల ఫోరం ప్రెసిడెంట్ నవీన్, ఎంపీటీసీ సత్యనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆరిపొద్దిన్, ఎంపీటీసీలు సునీత సుధాకర్, అల్లం లలిత, సర్పంచులు శ్రీహరి, లక్ష్మారెడ్డి, కుమార్, అశోక్, రమేష్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లాంగ్వేజ్ పండితులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

లాంగ్వేజ్ పండితులపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే. అశోక్, బి.సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఏండ్ల తరబడి ప్రమోషన్ లేకపోయినా, అలవెన్సులు ఇవ్వకపోయినా, జీతం పెరగకపోయినా హయ్యర్ క్లాసెస్ బోధిస్తున్న భాషా పండితులకు అన్యాయం జరుగుతుందన్నారు. వారి జాబ్ చార్టులో లేని పనులు చేస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి విద్యాబుద్ధులు నేర్పాలనే తపనతో మాత్రమే వారు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్లో తమ పదోన్నతుల అంశం లేకపోవడంతో ఆవేదనకు గురైన భాషా పండితులు..తమ జాబ్ చార్ట్‌లో లేని హైయర్ క్లాస్ బోధన చేయబోమని ఇచ్చిన పిలుపు నిరసన తెలిపారన్నారు. దాన్ని బూచిగా చూపిస్తూ రంగారెడ్డి, సంగారెడ్డి విద్యాధికారులు భాషా పండితులపై సస్పెన్షన్ వేటు వేయడం అన్యాయమన్నారు. దీన్ని టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వారిపై వేసిన సస్పెన్షన్ వేటు వెంటనే తొలగించాలని, పదోన్నతులపై ఉన్న కేసును ప్రభుత్వం కల్పించుకొని వేకెట్ చేయించి, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్లోనే పండితులకు సైతం పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వలిమా వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రేజింతల్ గ్రామానికి చెందిన సయ్యద్ ఇక్బాల్ మియా కుమారుడు లాలూ వలిమా విందులో జహీరాబాద్ టీపీసీసీ నాయకులు వై.నరోత్తం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. అనంతరం విందును స్వీకరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రేజింతల్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, కె.తిరుపతి రెడ్డి, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, సిరాజుద్దీన్, మహముద్ అలి, సైపుద్దీన్, బాలరాజ్, సయ్యద్ ఆరిఫ్, సంతోష్ సౌకారి ఉన్నారు.



నాగాభరణం అందజేత

నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొలారం మున్సిపాల్టీ పరిధిలోని కేబీఆర్ కాలనీలో గల శ్రీ భవానీ శంకర ఆలయానికి జెల్లా సత్యనారాయణ దంపతులు నాగాభరణంను ఆలయ కమిటీ చైర్మెన్ కొలను బాల్‌రెడ్డి సమక్షంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జెల్లా సత్యనారాయణ దంపతులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యులు, అనంతరావు గురుస్వామి, మాజి ఎంపీటీసీ రాగాల లక్ష్మీ నాయుడు, విజయ్ రెడ్డి, భక్తులు పాల్గోనారు.

ఎన్పీఆర్డీ ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కొండాపూర్



వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట రేపు(సోమవారం) తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఎన్పీఆర్డీ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని వికలాంగులందరూ ఈ ధర్నాలో పాల్గొని విజయం చేయాలన్నారు.

మహాశివరాత్రి పండుగ సందర్భంగా పండ్లు పంపిణీ



నవతెలంగాణ-సదాశివాపేట

స్థానిక ఈశ్వర మార్కండే మందిరంలో రాణా ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మెన్ పిల్లోడి జయమ్మ వీరన్నలు కుటుంబ సభ్యులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్ష చేస్తున్న శివ భక్తులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ పిలోడి జయమ్మ, వైస్ చైర్మెన్ చింతా గోపాల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ పిల్లోడి విశ్వనాథం, లు మాట్లాడుతూ.. మానవ జన్మ ఉత్తమమైనదని.. స్వార్థ ప్రయోజనాలు వీడి సమాజం కోసం పనిచేయాలన్నారు. 144 సంవత్సరాల తర్వాత ఇలాంటి రోజున శివరాత్రి పండుగ వచ్చిందని.. ఈసారి పండుగకు చాలా ప్రత్యేకత ఉన్నదన్నారు. కౌన్సిలర్లు పులిమామిడి రాజు, చౌదరి ప్రకాష్ , గాండ్ల చెన్నాకర్, రాణా ప్రతాప్ యూత్ కార్యకర్తలు పాలొన్నారు.

గంగ్వార్ నుంచి కేతకీ ఆలయానికి పాదయాత్ర

నవతెలంగాణ-న్యాల్‌కల్



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొందరు భక్తులు గంగ్వార్ నుంచి కేతకీ సంగమేశ్వర ఆశ్రయానికి పాదయాత్రగా వెళ్లి.. శివపార్వతులను దర్శించుకున్నారు. ప్రతీ సంవత్సరం ఇలాగే పాదయాత్రగా వెళ్లి.. శివపార్వతులను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అలాగే న్యాల్‌కల్ రామలింగేశ్వర ఆలయంలో, రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో, రాఘవపూర్ సరస్వతి పంచవటి క్షేత్రంలో భక్తులు కిటకిటలాడారు. పాదయాత్రగా వెళ్లిన వారిలో గంగ్వార్ భక్తులు బలవంత్ రెడ్డి, బి. విఠల్, ప్రభాకర్, పాండు, సాయి ఉన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం టెంటు ఏర్పాటు



నవతెలంగాణ-సదాశివాపేట

మహాశివరాత్రి పండుగ సందర్భంగా సదాశివపేట్ నుంచి ఏడుపాయల జాతరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్న విషయం విధితమే. కాగా ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 11వ వార్డ్ కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరి మాణిక్‌రావు టెంట్, ప్రయాణీకులు కూర్చోడానికి కుర్చీలు తెప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లడం ప్రమాదకరమని.. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలన్నారు.సదాశివపేట్ బస్టాండ్ ఇంచార్జ్ ప్రకాశ్, జె. బొంతప్ప, మహమూద్, సంగారెడ్డి బస్‌పాస్ కౌంటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐఐటి హైదరాబాద్‌లో ఎలాన్-ఎన్ విజన్ ఫెస్ట్

నవతెలంగాణ-కంది

మండల కేంద్రంలోని ఐఐటి హైదరాబాద్ క్యాంపస్‌లో విద్యార్థుల ఆర్గనైజేషన్‌లో శనివారం ఎలాన్-ఎన్ విజన్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యా ర్థులు తయారుచేసిన టెక్నికల్ ఈవెంట్స్‌తో పాటు పలు సంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. డేటా టు డాలర్ వెబ్ నార్, రోబోల ప్రదర్శన, టీవీఎస్ వారి అపాచీ రైడ్ షో, హిప్ హాప్ అంతర్జాతీయ నృత్య పోటీలు, సోలో డ్యాన్సులు చేపట్టారు. కవితల పోటీలో దాదాపుగా 60 మందికి పైగా పాల్గొని అందరిని ఆకట్టుకున్నారు. రామోజీ ఫిలిం సిటీ సీఈవో శేషకాంతం రాజు ఫెస్ట్ టాక్ షోకు మంచి స్పందన వచ్చింది. ఐఐటీ విద్యార్థులను వివిధ అంశాలలో మోటివేట్ చేసేందుకు ప్రముఖ విద్యావం తులు, మేధావులు స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ఫెస్ట్ టైటిల్ స్పాన్సర్‌గా గ్రీన్ కో సంస్థ వ్యవహరి స్తోంది. ఈ ఈవెంట్ లో చైనా,జపాన్,న్యూఢిల్లీ తదితర ఇంటర్నేషనల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కేతకి

- ఘనంగా మహా శివరాత్రి వేడుకలు
- దర్శనానికి 3 నుంచి నాలుగు గంటల సమయం
- ఆలయంలో ప్రముఖుల పూజలు
- జహీరాబాద్ డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు





నవతెలంగాణ-ఝరాసంగం

తెలంగాణ రాష్ట్రంలో శైవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన ఝరాసంఘం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచే దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, కు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. పార్వతి సమేత సంగమేశ్వర స్వామి వారి దర్శనానికి విఐపీ క్యూ లైన్ దర్శనం 3 గంటలు, సాధారణ దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. అమృత గుండంలో, ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శవర్స్ కింద భక్తులు స్నానాలు ఆచరించారు. అనం తరం గర్భగుడిలో గల పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శివ దీక్షాపరులు 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో చేపట్టిన శివ దీక్ష విరమించి మొక్కులు చెల్లించుకున్నారు. జహీరాబాద్ డిఎస్పి రఘు ఆధ్వ ర్యంలో పటిష్టమైన భద్రతా నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా మానిటరింగ్ చేశారు. ప్రత్యేకించి పారిశుధ్య కార్మికులు ఎప్పటిక ప్పుడు ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు...

మహాశివరాత్రి సందర్భంగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ శివ కుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ సంగమేశ్వర స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో గల శ్రీ సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకొని రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను, మాత శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పోషక పదార్థాల పండ్లు, పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, చూశారు. అంతేకాకుండా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ను వారు తిలకించారు. వారి వెంట ఆలయ కమిటీ చైర్మన్ నీలా వెంకటేశం, ఆత్మ కమిటీ చైర్మన్ పెంట రెడ్డి, గ్రామ సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఎంపీటీసీ విజెందర్ రెడ్డి, ధర్మకర్తలు ఎంపీ నాగన్న, లక్ష్మయ్య, బీఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్, సంగమేశ్వర్ పాటిల్, బసవ రాజ్ పాటిల్, ఎంపి సంతోష్ పాటిల్, ఏజాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరిం చుకుని అగ్ని ప్రతిష్ఠ, గణపతి హెూమం, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. రాత్రికి లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక అధికారి శశిధర్ తెలిపారు. రాత్రి జాగరణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

భగ్గుమన్న పండ్లు, కొబ్బరికాయలు, ఆట వస్తువుల ధరలు..

మహాశివరాత్రిని పురస్కరించుకొన ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు ఉపవాసాలు చేస్తారు. తిరిగి సాయంత్రం స్వామివారిని దర్శించుకుని పండ్లు, పలహారాలతో ఉపవాసాలను విరమింప చేస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో వెలసిన పండ్ల షాపులు, చిన్నపిల్లలు ఆడుకునే ఆట వస్తువుల ధరలు ఒకేసారి అమాంతంగా భగ్గుమన్నాయి. వామ్మో ఇవేమి ధరలు అంటూ సామాన్య ప్రజలు అవాక్కయ్యారు. ధరలు కట్టడి చేయడంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దీనికి కారణమని తెలుస్తోంది.

దృశ్యం సీన్ రిపీట్

వివాహిత హత్య కేసు ఛేదన

- గ్యాస్ సిలిండర్‌తో బాది.. ఆపై గొంతు నులిమి హతమార్చిన ప్రియుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వెంకటరెడ్డినగర్‌లో వివాహిత అనుమానాస్పద మృతిని.. రెండ్రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. ఆమె ప్రియుడే గ్యాస్ సిలిండర్‌తో బాది.. ఆపై గొంతు నులిమి హత్య చేసి పరారైనట్టు పోలీసులో విచారణలో వెల్లడైంది. ఈ మేరకు జిన్నారం సీఐ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి డీఎస్పీ భీమ్ రెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..

రామకృష్ణారెడ్డి, జ్యోతి అనే దంపతులు బొల్లారం వెంకటరెడ్డి నగర్‌లో నివాసముంటున్నారు. అయితే జ్యోతి నాలుగేండ్లుగా బాలచందర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈనెల 13న రామకృష్ణారెడ్డి ఇంట్లో లేకపోవడంతో.. బాలచందర్ రాత్రి 11.30 గంటల ప్రాంతంలో జ్యోతి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో జ్యోతికి ఫోన్ రావడంతో బయటికెళ్లి మాట్లాడి వచ్చింది. కాగా 'ఫోన్ ఎవరితో మాట్లాడావు.. నేను కాకుండా మరెవరితోనైనా చనువుగా ఉంటున్నావా' అని జ్యోతిపై బాలచందర్ గొడవపడ్డాడు. అయితే బాలచందర్ కుటుంబ సభ్యులను దూషిస్తూ.. అతని చెంపపై జ్యోతి కొట్టింది. దీంతో కోపోద్రిక్తుడైన బాలచందర్.. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఇంట్లోని చిన్న గ్యాస్ సిలిండర్‌తో జ్యోతి తలపై బలంగా కొట్టాడు. ఆమె ముఖాన్ని బెడ్ షీట్‌తో కప్పి గొంతు నులిమి హతమార్చాడు. ఎవరికీ అనుమానం రాకుండా.. తలుపులకు బయట నుంచి తాళం వేసి పరారయ్యాడు.



దృశ్యం సీన్ రిపీట్..

హత్య కేసు నుంచి తప్పించుకోవడానికి అచ్చం దృశ్యం సినిమాను తలపించేలా బాలచందర్ పలు ప్రయత్నాలు చేశాడు. మృతురాలి ఫోన్, ఇంటి తాళం చెవిని రోడ్డు పక్కన ఉన్న ఓ నాళాలో పడేశాడు. వెంటనే తిరుపతికి వెళ్లి ఎవరూ గుర్తుపట్టకుండా గుండు గీసుకున్నాడు. అక్కడినుంచి మైలార్ దేవులపల్లి లక్ష్మీగూడలోని తాను ఉంటున్న కిరాయి రూంకి తిరిగి వచ్చాడు. అయితే సీసీటీవీ, మృతురాలి ఫోన్ కాల్‌డేటా ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. కాగా మొదట్లో తనకేం తెలియదని.. తాను తిరుపతిలో ఉన్నానంటూ రైల్వే టికెట్లు చూయిస్తూ బుకాయించాడు. కానీ విచారణలో తానే నేరం చేసినట్టు అంగీకరించాడు. 48 గంటల్లోనే మిస్టరీ కేసును ఛేధించిన జిన్నారం సీఐ వేణుగోపాల్ రెడ్డి, గుమ్మడిదల ఎస్ఐ విజయ్, బొల్లారం హెచ్ఎస్ఓ వెంకట్‌రెడ్డిని, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



సైకత లింగార్చన మహోత్సవంలో మంత్రి

నవతెలంగాణ-సంగారెడ్డి

మండలంలోని ఫసల్వాది గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వారు సైకత లింగార్చన ఏర్పాటు చేశారు. ఈ మహోత్సవంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ దేవుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శరత్, మహిళా కమిషన్ చైర్మన్ సునితా లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి, ఎస్పీ రమణ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మున్సి పల్ కౌన్సిలర్ మంజులత నాగరాజు గౌడ్, శివకుమార్, వైఎస్ఆర్పిపి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఐసి మోహన్,ఆలయ వ్యవస్థాపకులు ఉమామహేశ్వర సిద్ధాంతి పాల్గొన్నారు.



సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్

ఉన్నత తరగతులకు బోదిస్తున్న పండితులు, పీఈటీలను ఎస్ఏలుగా అప్గ్రేడ్ చేయాలనీ కోరుతూ నిరసన వ్యక్తం చేసిన పండితులను శనివారం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్ అన్నారు. వారిని భయభ్రాంతులకు గురిచేయకుండా వారి సమస్యల పరిష్కారానికి సహకరించాలన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యదర్శులు ఏషప్ప, నరేష్, నర్సయ్య ఖేడ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హారిసింగ్, రాజు, విఠల్,గురునాథ్, బస్వరజ్‌లు పాల్గొన్నారు.

శివాలయాల్లో ఎమ్మెల్యేల ప్రత్యేక పూజలు





నవతెలంగాణ-అమీన్‌పూర్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శనివారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామన్నారు. శివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో హాజరవుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా పూర్తి ఏర్పాట్లు చేసామని తెలిపారు. పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ తులసి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో చేపట్టిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మాణిక్యరావు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని శ్రీ కైలాసాగిరి శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన సభ వేదిక పై మాట్లాడుతూ.. భక్తులకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ తరపున అల్లాడి వీరేశం సన్మానించారు. ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు మాంకల్ సుభాష్, అల్లాడి నర్సింలు, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు నామ రవికిరణ్, రాములు నేత, నాయకులు వైజ్యణత్ , ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూఢత్వాన్ని ప్రతిఘటించడమే భాగ్యరెడ్డి వర్మకు నివాళి



నవతెలంగాణ-సంగారెడ్డి

అన్ని రకాల అధిపత్యాలను, మనువాదాన్ని, ప్రతిఘటించడం ద్వారా మహనీయుల లక్ష్యాలు సాధించుకోవాలని.. మూఢనమ్మకాలను పారద్రోలడానికి సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ చూపిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని స్వేచ్ఛ జేఏసీ నాయకులు అశోక్ కుమా ర్, అతిమేల మానిక్, టీజీవో జిల్లా అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రామ చందర్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిలు, ప్రజా సంఘాల నాయకులు రాములు, ఎస్ఆర్, ప్రశాంతి, లక్ష్మి, సంజీవులు, సంగమేశ్వర్, న్యాయవాదులు రామా రావు, దర్శన్‌లు అన్నారు. భాగ్యరెడ్డివర్మ వర్ధంతి సందర్భంగా 'భాగ్యోదయం' పేరుతో 10వ తరగతి టెక్స్ట్ బుక్‌లోని భాగ్యరెడ్డి వర్మ జీవిత పాఠం బహిరంగ బోధన కార్యక్రమాన్ని స్వేచ్ఛ జేఏసి ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పక్కన గల మహనీయుల విగ్రహాల వద్ద నిర్వహించారు. సంఘసంస్కర్త, అట్టడుగు వర్గాలకు చదువు కోసం మూఢ విశ్వాసాలు వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కాగా ఈ కార్యక్రమంలో భాగ్యరెడ్డి వర్మ పాఠ్యాంశాన్ని తెలుగు టీచర్ చంద్రమోహన్ బోధించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కోటగిరి దళిత టీచర్ మల్లికార్జున్ పై పెట్టిన కేసుల్లో ఈ పాఠం బోధించారనేది కూడా ఒక కారణమన్నారు. అందుకే రాష్ట్రమంతటా ఈ పాఠం బహిరంగ బోధన జరుపుతున్నట్టు తెలిపారు. భారతీ య పౌరులందరు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. మూఢనమ్మకాలు, జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా తన తుది శ్వాస వరకు భాగ్యరెడ్డి వర్మ పోరాడడని తెలిపారు. కేంద్ర బీజేపీ అధికార అండదండలతో మతోన్మాద సంస్థలు రెచ్చిపోయి భౌతిక దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. హమారా ప్రసాద్ వంటి మతోన్మాది.. అంబేద్కర్‌ను కాల్చి చంపుతామనడం బీజేపీ ఇచ్చిన ధైర్యమేనన్నారు. అభ్యుదయ శక్తులు ఐక్యంగా మనుస్మృతి భావాలను తుదముట్టించి రాజ్యాంగాన్ని ఈ దుండగుల నుండి రక్షించాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు బసవరాజ్ పవన్, శివకుమార్, ప్రవీణ్, దాస్, లక్ష్మయ్య, మానయ్య భాస్కర్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో కిటికిటలాడిన భక్తజనం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

మహాశివరాత్రి సందర్భంగా బొల్లారం పారిశ్రామిక వాడలోని శైవ క్షేత్రాలు శనివారం భక్త జనంతో కిటికిట లాడాయి. వివిధ ఆలయాల్లో తెల్లవారుజామున నుంచే ఉపవాసాలతో, భక్తి శ్రద్ధలతో పరమశివుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత ఆలయంలో ఆలయ వైస్ చైర్మె న్ దీనానాథ్, భవాని శంకర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మల్లన్న ఆలయంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, కౌన్సిలర్ చంద్రారెడ్డి, హనుమంత్‌రెడ్డి పూజలు చేశారు.



రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి గడిల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శనివారం కౌన్సిలర్ టీ.సాయికిరణ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నేత టీ.రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాంత్ గౌడ్, పటాన్‌చెరు నియోజకవర్గం ప్రజాగోస బీజేపీ భరోసా కో ఆర్డినేటర్ సి.గోదావరి అంజిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బొల్లారం మున్సిపల్ పరిధిలో ఓల్డ్ విలెజ్ 3వ వార్డులో బీజేపీ రాష్ట్ర మరియు జిల్లా పార్టీ ఆదేశాల మేరకు బూత్ నెంబర్ 86, 87,88, 89 శక్తి కేంద్ర ఇంచార్జి మరియు కౌన్సిలర్ టీ. సాయికిరణ్ రెడ్డి, సీనియర్ నాయ కులు టీ.రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కౌన్సిలర్ వి.శ్రీకాంత్ యాదవ్, సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రవి, రాజు, ఉదయ్ కిరణ్, కే. లక్ష్మణస్వామి, జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు టీ.మేఘన రెడ్డి, కే.సర స్వతి, బొల్లారం మున్సిపల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు డి.స్రవంతి గోవారెడ్డి, ప్రధాన కార్యదర్శి రోహిత్ సింగ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో జనసందోహం

నవతెలంగాణ-జిన్నారం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆలయాల్లో జనసందోహం నెలకొంది. భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం కనిపించింది. జిన్నారంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జీవన జ్యోతిర్లింగాలయం కార్యక్రమంలో భాగంగా భక్తులు స్థానిక రామాలయం నుంచి బోలా శంకరుడి పల్లకి సేవ కార్యక్రమాన్ని ఊరేగింపుగా నిర్వహించారు. స్థానికంగా గల రామాలయం హనుమాన్ దేవాలయం, స్పటిక లింగ శివాలయాల్లో మహాశి వరాత్రి ఉపవాస దీక్ష కార్యక్రమాలను భక్తులు సంప్రదా యబద్ధంగా నిర్వహించారు. మండల పరిధిలోని జంగంపేటలో గల బుగ్గ రామేశ్వరాలయంలో, మండలంలోని శివనగర్, ఉట్ల, సో లక్ కపల్లి, రాళ్లకత్వ, దాదిగూడెం, మంగంపేట, వావిలాల గడ్డపోతారం చెట్ల పోతారం కాజిపల్లి, కొడకంచి, మాదారం, దూబగుంట లక్ష్మీ పతి గూడెం పుట్టగూడా అందూరు మిజాజి గూడెం తదితర గ్రామాల్లో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరిపారు.





దుర్గామాతను దర్శించుకున్న సునితా లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-పాపన్నపేట

కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏడుపాయలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఘనంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దుర్గమ్మ ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో రాష్ట్ర ప్రజలు జీవించాలని మొక్కినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆలయం ముందు ఉన్న మంజీరా నది పాయలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మెన్ బాలాగౌడ్ ఆమెను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం

రామలింగేశ్వర స్వామి కృపతో సేవా కార్యక్రమాలు చేస్తా
చౌటకూరి గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని చండూర్ గుట్టపై ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం చౌటకూరి గోవర్ధన్ రెడ్డి దంపతులు అభిషేకం చేశారు. వేద మంత్రాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చండూర్ గ్రామంలో వెలసిన శివలింగం, శ్రీశైలం శివలింగంతో సమానమన్నారు. ఈ రామలింగేశ్వర స్వామి కృపతో మరింత సేవా కార్యక్రమాలు చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మాజీ జిల్లా యువత ఉపాధ్యక్షుడు చౌటకురి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వనంలో జన జాతర



- దుర్గామాతకు భక్త నీరాజనం
- ఏడుపాయల మంజీరలో భక్తుల పుణ్యస్నానాలు

నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల వన దుర్గాదేవికి భక్తజనం నీరాజనాలు పలికారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ ఏడుపాయల వన దుర్గమాత ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయల జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధిగా మంత్రి టి హరీశ్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్, ఇఫ్కో డైరెక్టర్ ఎం దేవేందర్ రెడ్డిలు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మంత్రి హరీశ్‌రావు ఏడుపాయల జాతర ఉత్సవాలను ప్రారంభించారు. శనివారం ఉదయం దుర్గాదేవి ఆలయంలో మంగళ వాయిద్యం అమ్మవారికి అభిషేకం, సుప్రభాత సేవ విశేష పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ గర్భాలయంలో అర్చకులు ఆర్ శంకర్ శర్మ, పార్థీవ శర్మ రాజేష్, రాజశేఖర్, మురళీధర్, రాము శర్మ పవన్‌లు ఉదయం అభిషేకం తదితర పూజలు నిర్వహించి, పట్టు వస్త్రాలను దుర్గా దేవి అమ్మవారికి వివిధ రకాల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. దుర్గా మాత అమ్మవారికి బంగారు కిరీటం, మెడలో వజ్ర వైడూర్యాలతో తయారుచేసిన ముత్యాలహారం ఇతరత్రా నగలు అమ్మవారికి ధరించారు. గర్భాలయంలో దుర్గామాత అమ్మవారు బంగారు హారాలతో దగదగలాడుతూ కోటి కాంతుల మధ్య అమ్మవారు భక్త జనావళికి దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తుల కుంకుమార్చన తదితర విశేష పూజలు, ఆలయ పూజారులు, వేద బ్రాహ్మణులు పండితుల ఘోషలతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తి పారవశ్యంతో దద్దరిల్లాయి. ఏడుపాయలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వివిధ వాహనాల్లో భారీ ఎత్తున తరలివచ్చారు. రెండు మూడు రోజులపాటు భక్తులు ఉండేందుకు వీలుగా తట్ట బుట్ట వంట సామాగ్రి మేకలు, గొర్రెలు, కోళ్ళతో తరలివచ్చారు. ఏడుపాయల ప్రాంతంలో బండరాళ్ళ మధ్య చెట్లకింద విశాలమైన స్థలాల్లో టెంట్లు వేసుకుని గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. గుడారాలతో ఏడుపాయల ప్రాంతమంతా ఇప్పుడు జనారణ్యంచే మహానగరంగా తలపిస్తుంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు ఏడుపాయలకు చేరుకొని మంజీరా నదీ పాయల్లో చెక్ డ్యాములు, షవర్ బాత్ స్నాన ఘట్టాల వద్ద పుణ్య స్నానాలను ఆచరించారు. భక్తులు భక్తిప్రపత్తులతో దుర్గాదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులకు త్రాగు నీరుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొబైల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. జాతరలో భక్తులను అలరించేందుకు బేబీ డాన్స్ సర్కస్‌లు తదితర ఛాయాచిత్ర ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. జాతరలో పోలీసులు భారీ బందోబస్తు తో శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నారు. రెవెన్యూ, వైద్య-ఆరోగ్యం, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్,విద్యుత్, అటవీశాఖ, అగ్నిమాపక, ఆబ్కారీ, ఫుడ్ సేఫ్టీ, డిపిఓ ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది తదితర శాఖలు ఏడుపాయల జాతరలో క్యాంపులు ఏర్పాటు చేసుకొని భక్తులకు సేవలు అందిస్తున్నారు. కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్‌లు జాతరలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జాతరలో తినుబండారాలు, స్వీట్ షాపులు, హెూటల్లు కిరాణం బొమ్మల షాపులు, బ్యాంగిల్ స్టోర్, కూల్ డ్రింక్ షాప్‌లు పెద్ద ఎత్తున వెలిశాయి.







ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసిన సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి,ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మండలంలోని ముత్తాయికోట గ్రామంలోని ప్రసిద్ధ సిద్ధిరామేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డిని ఆలయ కమిటీ, గ్రామ ప్రముఖులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్సీ దంపతులతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ మహిమాన్విత సిద్ధిరామేశ్వర స్వామి ఆలయానికి ప్రతి సంవత్సరం కూడా రావడం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నదని ఎమ్మెల్సీ కొనియాడారు. గ్రామస్థుల సహకారంతో సిద్ధిరామేశ్వర స్వామి అభివృద్ధి చెందినదని, ఆలయ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుతున్నారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. గ్రామస్థులు ఏకధాటిపై ఉండి గుడిని ఇంకా అభివృద్ధి చెందే విధంగా చూడాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. హవేలి ఘనపూర్ మండలంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పలు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహిపాల్ రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు శ్రీను నాయక్, భిక్షపతి, మాజీ సర్పంచ్ కిరణ్ గౌడ్, తదితరులు ఉన్నారు..

నేడు కొండపోచమ్మ కాలువ నీరు విడుదల



నవతెలంగాణ-నిజాంపేట

కొండపోచమ్మ నుంచి రామాయంపేట కెనాల్ ద్వారా వచ్చే గోదావరి జలాలను నిజాంపేట మండల పరిధిలోని నార్లపూర్ హైదర్ చెరువులోకి ఆదివారం విడుదల చేయనున్నారు. మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షాలు నీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ రాజర్షిషాతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు నార్లపూర్ గ్రామ శివారులోని రామాయంపేట కెనాల్ కాలువ పనులను, సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రజల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని నార్లపూర్, బచ్చు రాజు పల్లి, తిప్పనగుల్ల, గ్రామాల సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, తూప్రాన్ డీఎస్పి యాదగిరి రెడ్డి, రామాయంపేట సిఐ చంద్రశేఖర్ రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మండలం పీపీ సిద్ధిరాములు, డిప్యూటీ తహసిల్దార్ గంగా ప్రసాద్, ఆర్ఐ యూసుఫ్ అలీ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అమర సేనా రెడ్డి, కల్వకుంట సొసైటీ చైర్మన్ అందే కొండల్ రెడ్డి, చల్మెడ ఎంపీటీసీ బాల్రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, సంపత్, యాదగిరి, అనిల్, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు

నవతెలంగాణ-కొల్చారం



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం కొల్చారం మండలంలోని భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు ఈ నెల 18 నుంచి ప్రారంభమైన శివరాత్రి జాతర ఉత్సవాలు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆదివారం ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారికి బండ్లు తిరుగుట, సోమవారం తెల్లవారుజామున రథోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అందుకోసం ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. అలాగే ట్రాఫిక్ అంతరాయం లేకుండా కొల్చారం మండలం టేకులగడ్డ ప్రాంతంలో వాహనాల నిలుపు కోసం పెద్ద ఎత్తున పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సమీప వనదుర్గ ప్రాజెక్టులో పుణ్యస్నానాలు ఆచరించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. లోతట్టు ప్రాంతాల వద్ద మత్స్య శాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను సైతం ఏర్పాటు చేశారు.

నందిగామలో మల్లన్న కళ్యాణ మహెూత్సవం



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల పరిధిలో ని నందిగామ గ్రామంలో శనివారం మహాశివరాత్రి పురస్కరించుకొని మల్లన్న కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహెూత్స వం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్ల శ్రీనివాస్ దంపతులు, యాదవులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కొండపాక రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కొండపాక

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలో ని కొండపాక దుద్దెడ కుకునూరు పల్లి మరపడగా తదిత గ్రామాల్లోని శివాలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. రాజ్యసభ మాజీ సభ్యులు వి హనుమంతరావు మండల కేంద్రంలోని రుద్రేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పీసీసీ మేధావుల సంఘం చైర్మన్ అనంతుల శ్యామ్మోహన్, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వి లింగారావు, శ్రీనివాస్ రెడ్డి, ఆర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ షాక్ తగిలి గిరిజన మహిళ మృతి

నవతెలంగాణ-రేగోడు : విద్యుత్ షాక్ తగిలి గిరిజన మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బురన్ వాడి తండాలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం బురనివాడి తండాకు చెందిన మెగావత్ బుజ్జి భాయ్ (52) బట్టలు ఆరవేసే తీగ ద్వారా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. విద్యుత్ పోల్ నుంచి ఇంట్లోకి వచ్చే విద్యుత్తు సర్వీస్ వైర్ ఇంటి రేకులకు తాకడంతో రేకులకు ఆనుకుని ఉన్న బట్టలు ఆర వేసే తీగకు విద్యుత్ సరఫరా అయింది. బుజ్జి బాయ్ సర్వీస్ వైర్‌కు తగిలి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త మిట్టు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలి

- రైతులకు పనిముట్లు అందుబాటులో ఉండాలి
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని పారిశ్రామిక వాడలో ఏర్పాటైన అక్షయ అగ్రి పరిశ్రమలో తయారవుతున్న వ్యవసాయ యంత్రాలను మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు యంత్రాల తయారి విధానం, వాటి పనితీరును మంత్రికి వివారించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం అనేది ఒక పరిశ్రమగా ఎదిగి స్థిరపడాలని, వ్యవసాయం ఒక సాంప్ర దాయ పద్ధతిలో సాగే సాగు విదానం కాకూడదన్నారు. వ్యవసాయం ఒక పరిశ్రమగా వృద్ధి చెందాలనేదే మన లక్ష్యమన్నారు. చిన్న సన్నకారు రైతులు యంత్రాలను వాడే పరిస్థితి లేదన్నారు. అందుకు ఏ రైతులకు ఏది అవసరమో అది రైతు ఫోన్ కొడితే అందుబాటులో ఉండే విదానం అందుబాటులోకి రావాలని తెలిపారు. ప్రపంచంతో పోటీపడే విధంగా మన విధానం ఉండాలన్నారు. మనం పండించే ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో పోటీలో నిలిచే పరిస్థితి ఉండాలన్నారు. అందుకే నూతన ఒక సమగ్రమైన సాగు విధానం భారత దేశంలో అమలు జరగాలని, అప్పుడే వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు ఒక పరిశ్రమగా ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. సాంప్రదాయ వృత్తిగా ఈ దేశంలో ఉన్న పరిస్థితిని బట్టి బ్రతుకుదెరువుకోసం ఏదో ఒకపనిచేయాలనే విధంగా ఉందని తెలిపారు. ఇతర వ్యాపకాలకంటే వ్యవసాయంలో ఎక్కువ ఆదాయం పొందుతామనే ఆలోచన విశ్వాసం రైతులకు లేదన్నారు. కానీ తెలంగాణలో చేపడుతున్న ప్రత్యేక చర్యలు వేరని, ఇక్కడి చర్యలే దేశవ్యాప్తం కావాలన్నారు. సాంకేతిక రంగంలో రైతు భరించగలిగే విధంగా, అన్ని రకాల పనిముట్లను వాడుకుంటే వ్యవసాయం ఒక పరిశ్రమలా వృద్ధి చెందుతుందన్నారు. దాంతో ప్రపంచ అహారపు అలవాట్లను ఒక్క భారతదేశమే తీర్చ గలుగుతుందని మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ జయరాజ్, డీఏవో ఆశాకుమారి, ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్, వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, సర్పంచ్ నరాల ప్రభావతి పెంటయ్య, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్, నాయకులు పంజా భిక్షపతి, మండల రైతు బంధు కోఆర్డినేటర్ యంజాల సుధాకర్‌రెడ్డి, నాయకులు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధిలో అందలమెక్కించడమే లక్ష్యం

- జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త
- బగలాముఖీ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నర్సాపూర్

అభివృద్ధిలో శివ్వంపేట మండలాన్ని జిల్లా స్థాయిలో ముందుంచాలన్నదే తన లక్ష్యమని మెదక్ జిల్లా పరిషత్ ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అన్నారు. శనివారం జడ్పీటీసీ మహేష్ గుప్త జన్మదినం సందర్భంగా శ్రీ బగలాముఖీ శక్తిపీఠంలో బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బగలాముఖీ అమ్మవారి ఆశీస్సులతో పాటు అమ్మవారి ఉపాసకులు శాస్త్రల వెంకటేశ్వర శర్మ దంపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. తన జన్మదినం సందర్భంగా ఉమా మహేశ్వరాలయంలో జడ్పీటీసీ మహేష్ గుప్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యం తన స్వంత డబ్బులతో సేవా కార్యక్రమాలను చేపట్టే జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త తన పుట్టినరోజు సందర్భంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టారు. గుండ్లపల్లి గ్రామానికి ఉప్పునూతల సత్యనారాయణ గౌడ్ కుమారుడు శ్రీకాంత్ గౌడ్ ఉన్నత విద్యా చదువుతూ ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మహేష్ గుప్త తన జన్మదినం సందర్భంగా ల్యాప్ టాప్ అందజేశారు. శివ్వంపేట గ్రామంలో 5వ వార్డులో తన స్వంత డబ్బులతో మంచినీటి బోరును వేయించడమే కాకుండా ప్రతి ఇంటింటికి మంచినీటి వాటర్ టిన్ అందజేశారు. గ్రామంలోని మహిళలందరికి జెడ్పీటీసీ జన్మదిన కానుకగా చీరలను పంపిణీ చేశారు. తన జన్మదినం కానుకగా శివ్వంపేటలో రూ.2 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని జెడ్పీటీసీ హామీ ఇచ్చారు. పబ్బ మహేష్ గుప్త పుట్టినరోజు సందర్భంగా గోమారం గ్రామంలో ప్రణీత్ రెడ్డి తన స్వంత డబ్బులతో 10 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలు మండలాన్ని మరింత అభివృద్ధి చేయడమే తప్ప తన స్వార్థమేది లేదన్నారు. తనకు వెన్నంటి ఉండి అన్ని రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. తనపై ఇంతటి అభిమానాన్ని ఉంచి తన జన్మదిన వేడుకలకు భారీ సంఖ్యలో హాజరైన అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు, ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా శివ్వంపేట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ పద్మ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య, గ్రామపంచాయతి వార్డు సభ్యులకు పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పీఎంజీ యువసేన సభ్యులు,నాయకులు, మహేశన్న అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోలా శంకరుడు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త

- జెడ్పీటీసీ జన్మదిన వేడుకలలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి
- అభిమానుల మధ్య జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నర్సాపూర్

మహాశివరాత్రి పర్వదినం రోజున పుట్టినందునే శివ్వంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు బోలా శంకరుని గుణగనాలు వచ్చాయని అందుకే ప్రతి నిత్యం దానధర్మాలు చేస్తుంటాడని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి శివ్వంపేటలో శనివారం జరిగిన జెడ్పీటీసీ మహేష్ గుప్త జన్మదిన వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరై జెడ్పీటీసీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ మండలానికి జెడ్పీటీసీగా గెలువక ముందు నుంచే తన స్వంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న పబ్బ మహేష్ గుప్త జెడ్పీటీసీగా గెలుపొందిన నాటి నుంచి నేటి వరకు పేదింటి పెండ్లిళ్లకు, అత్యవసర పరిస్థితులలో ఉండే బాధిత కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చులకు తన స్వంత డబ్బులను అందజేస్తూ నేనున్నానని భరోసా ఇచ్చే జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు రాజకీయంగా మేమంతా మరింత అండగా ఉంటామన్నారు. గత కొన్ని రోజుల క్రితమే శివ్వంపేటలో బగలాముఖీ అమ్మవారి శక్తిపీఠం నిర్మాణం చేసుకున్నామని, అమ్మవారి చల్లని దీవెనలతో జెడ్పీటీసీ మహేష్ గుప్తకు నిండు నూరేళ ఆయుష్షు ప్రసాదించి శివ్వంపేట మండల ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టే విధంగా అమ్మవారి ఆశీస్సులు అందించాలని ఆయన అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం లేవగానే శివ్వంపేట మండలంలో జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త చేసిన సేవా కార్యక్రమాలే వాట్సాప్ గ్రూపులు, పేపర్లలో కనిపిస్తాయన్నారు. తన స్వంత డబ్బుల తో నిత్యం ఎదో ఒక గ్రామంలో సేవా కార్యక్రమాలను చేపడుతూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న గొప్ప నాయకులు పబ్బ మహేష్ గుప్త అని ప్రసంసించారు. తాత పబ్బ అంజయ్య గుప్త బాటలో నడుస్తూ, శివ్వంపేటలో బగలాముఖీ శక్తిపీఠం నిర్మాణం చేపట్టారని, భగవంతుని చల్లని దీవెనలతో నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పబ్బ రమేష్ గుప్త,వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పి కో ఆప్షన్ మన్సూర్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, కౌన్సిలర్ అశోక్ గౌడ్, రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్ గుప్త,పీఎసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లావణ్య మాధవరెడ్డి, సర్పంచులు గొల్ల చంద్రకళ శ్రీశైలం, సోము అశోక్, ఏనుగు అశోక్ రెడ్డి, గయినిబైటి శ్రీనివాస్ గౌడ్, చిట్యాల లక్ష్మీ బాలపోచయ్య, పెంజర్ల శ్రీనివాస్ యాదవ్, పిట్ల సుగుణ శ్రీనివాస్, తుక్య నాయక్, బొడ్డు వెంకటేశ్వర్లు, బొల్ల భారతి బిక్షపతి, ఉపసర్పంచ్ పద్మ వెంకటేష్, నవీన్, కాముని శ్రీనివాస్, ఎల్లం, ఆత్మ కమిటీ డైరెక్టర్లు వంజరి కొండల్, సూర్యం చౌహన్, కోశాధికారి బండారి గంగాధర్, గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య,చెన్నాపూర్ బొల్ల ఆంజనేయులు, మాజీ కో ఆప్షన్ మెంబర్ దావుద్,వంజరి గౌరీశంకర్, పైనం యాదగిరి, పత్రాల దేవేందర్,బాసంపల్లి పోచ గౌడ్, అశోక్, భాస్కర్ గుప్త, ఖదీర్, షేక్ అలీ, పీఎంజీ యువసేన సభ్యులు, మహేష్ గుప్త అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

గట్టు గుట్టపై ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



నవతెలంగాణ-తొగుట

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల గట్టు గుట్టపైన ఆంజనేయ స్వామి, మైసమ్మ దేవాలయాలలో పూజలు, జాతర జరుపు కోలేక పాయమని నిర్వా సితులు ఆవేదన వ్యక్తం. శనివారం వేములఘట్, ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెప హాడ్ గ్రామాల మహా శివరాత్రి సందర్భంగా ఆంజనేయ స్వామి, మైసమ్మను దర్శించుకున్నారు. అనంతరం మైసమ్మకు వోడి బియ్యం పోసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి ఈ గట్టు గుట్టపై శివరాత్రి రోజు ఘనంగా జాతర ఉత్సవం జరుపుకునే వాళ్లమన్నారు. కానీ మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేయడం వల్ల 3 సంవత్సరాల నుంచి ఉత్సవాలు నిర్వహించ లేక పోయామన్నారు. ఈ సంవత్సరం తుక్కాపూర్ పంపు హౌజ్ పక్క నుంచి పల్లెపహాడ్, వేములఘట్ గ్రామల వారు కొందరు స్వంత డబ్బులతో చిన్న పాటి దారి ఏర్పాటు చేయడం వల్ల ఈ మహా శివరాత్రి ఉత్సవం నిర్వ హించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 3 సంవత్సరాల తరువాత గుట్టకు వచ్చి దేవుని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దేవాలయానికి రోడ్డు నిర్మించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దాసరి ప్రశాంతు, దుద్దెడ నగేష్,మెడ మైన కనకయ్య,కుంట శీను, మేడమైన పెద్దలు, ముత్యాల కృష్ణ, కొంతం అశోక్,దాసరి నర్సింలు, కొంతం అజయ్, కుంట అంజయ్య గుప్త,అంజయ్య, నరసయ్య, కొంతం అజయ్, కొరిమి నరసయ్య, కొంతం బైరయ్య తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను తుద ముట్టించిన భాగ్యరెడ్డి వర్మ



నవతెలంగాణ-నిజాంపేట్

సమాజంలో మూఢనమ్మకాలను పాటించవద్దని అందరు చదువుకొని చైతన్యం పొంది గౌరవంతో జీవించాలని తన జీవితాన్ని సమాజ మార్పు కోసం అంకితం చేసిన మాహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని మాల మహానాడు నిజాంపేట మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో శనివారం భాగ్యరెడ్డి వర్మ 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పదవతరగతి తెలుగు పుస్తకంలోని భాగ్యోదయం పాఠాన్ని బహిరంగంగా చదివారు. ఈ సందర్భంగా డిబీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, ఉప సర్పంచ్ కొమ్మాట బాబు, బండారు చంద్రయ్యలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారి చంద్రయ్య మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. హైదరాబాదు నగరంలో మొట్టమొదటిసారి బాలికలలకు పాఠశాలలను నెలకొల్పాడాని చెప్పారు. క్షయ వ్యాధి గ్రస్తులకు సేవలు చేస్తు తాను సైతం క్షయ వ్యాధికి గురై మరణించాడన్నారు.అది హిందూ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట ఉప సర్పంచ్ బాబు, గోరే నర్సింలు, గుడ్ల బాబు, బండారి దుబ్బరాజు, బేగరి శివయ్య, మంగలి రాములు, గంగ పోచయ్య పాల్గొన్నారు.

రాంపూర్ కోటిలింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-తొగుట : రాంపూర్ కోటిలింగాల ఆలయంలో నిర్వహిస్తున్న పూజల్లో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. శనివారం మహా శివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని రాంపూర్ కోటిలింగాల దేవస్థానంలో జరిగిన రుద్రాభిషేకంలో శ్రీనివాస్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొన్నా రు. అనంతరం ఆలయంలో జరిగిన శని త్రయోదశి పూజలో పాల్గొన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో పదికాలాలపాటు చల్లగా చూడాలని మహా శివుణ్ణి కోరుకున్నట్లు తెలిపారు. రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు ఆయన చెప్పారు. ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని ముదిరాజ్ కులస్తులందరితో సంఘంలో సభ్యత్వం చేయించాలని పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మిద్దె రవి ముదిరాజ్ అన్నారు. శనివారం పట్టణంలో పట్టణ ముదిరాజ్ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజబోయిన రాజు, యాట రాజేష్ ,నీలం సురేష్, కండ్లకోయ గౌరీ శంకర్, గుర్రం శీను, నాయిని కృష్ణ, బోనాల నర్సింలు, బోనాల నాగరాజు, కోడూరి వెంకటేష్, కేసరి శేఖర్, జెల్ల నరేష్ , మంతూర్ శేఖర్, తొడెంశీంగుల నాగరాజు, బోనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య.



నవతెలంగాణ-తొగుట

అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవంతో తీవ్ర మనోవేదనకు గురై రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెంకట్రావుపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కర్ణాకర్ తెలిపిన కథనం ప్రకారం... ఆ గ్రామానికి చెందిన ఈదు గళ్ల మల్లేశం(45) తన ఎకరమున్న భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పంట దిగుబడి సరిగా రాక, కౌలు చెల్లించ లేక, పెట్టుబడి కోసం, ఇతర ఖర్చుల కోసం చేసిన అప్పు రూ.4 లక్షలకు చేరుకుంది. చేసిన అప్పులు, వడ్డీ లు పెరిగి పోతుండడంతో మనస్థాపానికి గురై గురువారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గ్రామస్తుల సహకారంతో సికింద్రాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని కి భార్య మంజుల, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

నవతెలంగాణ 4
సిద్దిపేట
ఆదివారం 19 ఫిబ్రవరి 2023



మల్లేశం కుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ-తొగుట

ఈదుగల్ల మల్లేశం అకాల మరణం చాలా బాధాకరమని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడి పల్లి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రావు పేట గ్రామానికి ఈదుగాళ్ల మల్లేశం అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకుని ఎంపీటీసీ కంకణాల నర్సింలుతో కలిసి శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మల్లేశం మరణంతో వారి కుటుంబం పెద్దదిక్కు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను అండగా ఉంటా మని హామీ ఇచ్చారు. రూ.4 వేల ఆర్థిక సహాయం అందించారు. రైతు బీమా ద్వారా కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. రైతుబంధు అధ్యక్షులు బండారు స్వామి గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరసింగరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరుశరాములు, గ్రామ పార్టీ అధ్యక్షుడు శివయ్య, ఎఫ్ఎ కల్లెపు నవీన్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన దేవాలయాలు









నవతెలంగాణ-నంగునూరు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నంగునూరు మండలం వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. నంగునూరు, సిద్దన్నపేట మగ్దుంపూర్,నర్మెట, మైసంపల్లి, కోనాయిపల్లి, రాజగోపాల్ పేట,పాలమాకుల, ముండ్రాయి,బద్దిపడగ, అక్కేనపల్లి, గట్లమల్యాల, ఖాతా తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎద్ల సోమిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, సర్పంచులు బిక్షపతి నాయక్, చల్ల దశమంతా రెడ్డి, ఎంపీటీసీ బెదురు తిరుపతి, మార్కెట్ కమిటీ, సొసైటీ డైరెక్టర్లు, రైతు బంధు సమితి గ్రామ శాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-మద్దూరు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మద్దూరు దూల్మిట్ట మండలాల్లోని అన్ని గ్రామాలలో శివరాత్రి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెక్కల్ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మద్దూరు మండల కేంద్రంలో రామాలయంలో ఆలయ పూజారి పానుగంటి తిరుపతయ్య ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు.

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో గట్టు మల్లన్న బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలతో మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి గట్టు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, బైరాన్ పల్లి ఎంపిటిసి నందన బోయిన నర్సింలు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. గజ్వేల్ పట్టణంలోని పాత రామాలయంలో గల శివాలయంలో గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ కళ్యాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షల సందర్భంగా శివాలయంలో ఉదయం ప్రత్యేక శివునికి పూలమాలు, పాలు పెరుగులతో శుభ్రం చేసి పూజ చేశారు. అంతేకాకుండా గజ్వేల్ పట్టణంలోని శివాలయం, ప్రజ్ఞాపూర్ లో ఉన్న పార్థీవేశ్వర దేవాలయంలో తో పాటు ఇతర దేవాలయాలు భక్తుల సందడి కనిపించింది.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వేయి సంవత్సరాలనాటి శంభు దేవాలయంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు చక్రవర్తి యాదవ్,రైతు బందు అధ్యక్షుడు ఏల్పుల ఐలయ్య యాదవ్,బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగ లింగం, రంగు రమేష్ గౌడ్,బీఆర్ఎస్వీ నాయకులు చింటు గౌడ్, సాగర్ పురోహితులు జనమంచి సీతారామ శర్మ పంతులు,నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా శనివారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో పార్థీశ్వర శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంలో అన్ని దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజ్ఞాపూర్ శివాలయం కి రోడ్డు సౌకర్యం కోసం ఇటీవల నిధులు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా ఎండోమెంట్ కింద ఉన్న దేవాలయాల ప్రత్యేక నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు తల కొక్కుల లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ కుర్ర సాయి రెడ్డి, దుర్గాప్రసాద్, స్వామి చారి, తుమ్మ నర్సింలు, తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ప్రతిఏటా పొట్లపల్లిలో జరిగే జాతరకు శనివారం భక్త జనం పోటెత్తింది. శ్రీ స్వయంభు రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వేలాదిమంది తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుండి భక్తులు ఆలయానికి దర్శనం చేసుకునేందుకు వచ్చారు. పొట్లపల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. క్యూలైన్ లో భక్తులు దైవ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పొట్లపల్లిలో ప్రత్యేక పూజలు చేసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సతీష్ కుమార్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నారు. కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ,సిద్దిపేట అడిషనల్ ఎస్పీ సందేపోగు మహేందర్ ,మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస, అక్కన్న పేట ఎంపీపీ మాలోతు లక్ష్మీ బీల్ నాయక్, జడ్పిటిసి భూక్య మంగ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పొట్లపల్లి జాతరలో పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను సిద్దిపేట అడిషనల్ ఎస్పి సందేపోగు మహేందర్ పరిశీలించారు.హుస్నాబాద్ ఏసీపి సతీష్, సీఐ ఎర్రల కిరణ్ వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లకు బారి గేట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాతరలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.







భాగ్యరెడ్డివర్మకు నివాళి



నవతెలంగాణ- గజ్వేల్

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు యాదగిరి, తుమ్మ శ్రీనివాస్, నిరుడు స్వామి మాట్లాడుతూ దళిత వైతాళికుడుగా ప్రసిద్ధిచెందిన భాగ్యరెడ్డి వర్మ సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పొన్నాల కుమార్, వర్గల్ మండల అధ్యక్షుడుయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

51 కిలోల అక్షింతలతో శివుడి చిత్రం



నవతెలంగాణ- గజ్వేల్

శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా శివుని చిత్రాన్ని 51కిలోల అక్షింతల చిత్రించారు. శనివారం రామకోటి కార్యాలయంలో గజ్వేల్ పట్టణాన్నికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు ఆవిష్కరించారు.

శివ భక్తులకు ఫ్రూట్స్‌జ్యూస్ పంపిణీ



నవతెలంగాణ- గజ్వేల్

మహా శివరాత్రి సందర్భం గా సీతరామ ఉమామహేశ్వర దేవాలయము గజ్వేల్‌లో శనివారం భక్తులకు ఫ్రూట్ జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్వెల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా మాజీ మునిసిపల్ చైర్మన్ భాస్కర్, కొండపోచమ్మ డైరెక్టర్ గోలి సంతోష్ కుమార్, ఆలయకమిటీ సభ్యులు మార్కెట్ డైరెక్టర్. శ్రీనివాస్, మొనగారి రాజు, మాజీ కౌన్సిలర్ సంతోషిని రామచంద్ర చారి, నాయకులు.నేతి చిన్నసంతోష్, దేశబోయిన నర్సింలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలో ని బేగంపేట ఎంపీటీసీ పోతిరెడ్డి స్రవంతి దంప తులు తమ స్వంత ఖర్చులతో రుపొందిం చిన నూతన ఏకరూప దుస్తులను బీఆర్ఎస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి శనివారం క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. ఏకరూప దుస్తులందజేసిన ఎంపీటీసీ స్రవంతి దంపతులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొండాపూర్‌లో నవగ్రహాల ప్రతిష్ఠ



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలోని గట్టు మల్లన్న ఆలయంలో సత్యం స్వామి ధార్మిక ట్రస్టు చైర్మన్ సత్యం స్వామి ఆధ్వర్యంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ సత్యం స్వామి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు కొండాపూర్ లోని గట్టు మల్లన్న ఆలయంలో నవగ్రహాలు లేకపోవడంతో ట్రస్టు ద్వారా నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ట చేసినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేఖ నాయక్ ఎంపీటీసీ ఇస్లావత్ నముకు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం లగ్జరీ బస్సుల ఏర్పాటు

- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ప్రాంత ప్రజలు హైదరాబాద్‌లాంటి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. శనివారం హుస్నాబాద్ బస్టాండ్‌లో నూతన లగ్జరీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంత్రి హరీశ్‌రావు కృషితో లగ్జరీ బస్సులను హుస్నాబాద్ డిపోకు తీసుకువచ్చామన్నారు. ఇన్చార్జి డిపో మేనేజర్ లేకపోవడంతో సమస్యలు వచ్చాయని, పర్మినెంట్ డిపో మేనేజర్‌ను నియమించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో యాదగిరిగుట్ట వరకు గోదావరిఖని వరకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, ఎంపీపీలు లకావత్ మానస సుభాష్, మాలోతు లక్ష్మీ బీలు నాయక్, జెడ్పీటీసీ భూక్యమంగా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-దౌల్తాబాద్

మహాశివరాత్రి పండగ పర్వదిన సందర్భంగా మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని స్వయంభూ శంభు లింగేశ్వర దేవాలయంతోపాటు మండల వ్యాప్తంగా శివాలయాలు ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దౌల్తాబాద్ పట్టణంలో సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రధాన వీధులలో ఊరేగింపు ద్వారా ప్రతి ఏటమాదిరిగానే స్వయంభూశంభులింగేశ్వర దేవాలయం వరకు రథాన్ని భక్తులు తరలించారు. అదే మాదిరిగా దొమ్మాట గాజులపల్లి రెండు గ్రామాల మధ్య చాముండేశ్వరి గురు దత్త పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజా శ్యామల మహా యాగాన్ని నిర్వహించారు. ఈ యాగానికి తాజా మాజీ సివిల్ సప్లై రాష్ట్ర చైర్మన్ మా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్ పూజిత దౌల్తాబాద్ ఎంపీటీసీ ఆది వనిత వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమర్థవంతమైన పాలన అందిస్తున్న కేసీఆర్

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్

సమర్థవంతమైన పాలన ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి కేసీఆర్ అవసరమని ప్రజలు గుర్తించినట్లు మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మిరిదొడ్డి మండలం కాజీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన యాదాద్రి యాత్ర గజ్వేల్ కు శనివారం చేరుకుంది. ఈ యాత్రకు ఘన స్వాగతం పలికారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత దేశానికి ప్రధానమంత్రి కావాలని ఖాజీపూర్ నుండి యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి స్వామి దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పాదయాత్ర చేస్తున్న మిరుదొడ్డి మాజీ ఎంపీపీ పంజాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా కేసీఆర్‌ను చూడాలన్నదే తన కోరిక అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల పార్టీ ప్రెసిడెంట్ బెండే మధు, టౌన్ ప్రెసిడెంట్ నవాజ్ మీరా, రమేష్ గౌడ్ మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఖాజీపూర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీచైతన్య పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

శ్రీ చైతన్య పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం రంజిత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చదువుల పేరుతో లక్షల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. పరిమిషన్ లేకుండా విద్యా సంస్థలను నడుపుతూ ప్రభుత్వాన్ని, విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి ఇలాంటి విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు రోజుకి ఈ విద్యాసంస్థల్లో విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్పొరేట్ విద్యా సంస్థలు నడపడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తుందన్నారు. కార్పొరేట్ విద్య సంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయలన్నారు.లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలపై పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.రంజిత్ రెడ్డి వెంట డివిజన్ నాయకులు సంజీవ్, మధు, ఉమేష్, కిరణ్, రియాజ్ ఉన్నారు.

కేసీఆర్ దేశ ప్రధాని కావాలి

- పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ ప్రధాని కావాలని కోరుకుంటూ దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన పాదయాత్ర రెండో రోజు జగదేవ్‌పూర్‌కు చేరుకుంది. మాజీ ఏఎంసీ చైర్మన్ నంట బాపురెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సిద్ది భూపతి గౌడ్‌లు వారి పాదయాత్రకు సంఘీభావం తెలిపి, పాదయాత్ర చేస్తున్న కార్యకర్తలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని కావాలని ఖాజీపూర్ నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వరకు పాదయాత్ర చేయడం హర్షనీయమన్నారు. కేసీఆర్ ప్రధాని అయితే పలు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత ప్రభుత్వాలలో జరగని అభివృద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, మధు, బత్తుల రాజు, పరశురాములు, చిరంజీవి, నాగరాజు, వీరయ్య, రమేష్, మహేందర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

శ్రీ స్వయంభూరాజేశ్వర స్వామి పొట్లపల్లి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు వాలంటీర్లుగా సేవలందిస్తున్న పూర్వ విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అభినందించారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఈడీ బూట్ల రాజు మల్లయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మద్దూరి ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గుట్టపై రూ.5 లక్షలతో సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి ట్యాంకు చుట్టూ టైల్స్ వేయిస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలతో సీసీరోడ్లు వేసినందుకు, తాగునీటి ట్యాంక్ చుట్టూ టైల్స్ వేస్తానని చెప్పినందుకు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ లింగారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, బైరాన్ పల్లి ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు ముదిరాజ్, బి ఆర్ ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బడుగు సాయిలు ఆలయ కమిటీ డైరెక్టర్ గొట్టపర్తి వెంకటయ్య, బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిచెలిమి రాములు, నాయకులు ఎర్ర మల్లేశం, బొల్లు గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేసిన పండితులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- పీఆర్టీయూ గజ్వేల్ మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి



నవతెలంగాణ -గజ్వేల్

సస్పెండ్ చేసిన పండితులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పీఆర్టీయూ గజ్వేల్ మండల అధ్యక్షులు ఉడేము వేమారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 9,10 తరగతులకు బోధించడం లేదని సాకుతో వారిని సస్పెండ్ చేయడం బావ్యం కాదన్నారు. వారికి న్యాయం పరమైన డిమాండ్స్‌ను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. పదోన్నతులు రాలేక చాలా మంది పండితులు గ్రేడ్ 2 గానే రిటైర్మెంట్ అవుతున్నారని అన్నారు. సస్పెన్షన్ అయిన పండితులను వెంటనే విధులలోకి తీసుకుని వారికి పదోన్నతులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పాదయాత్రకు సంఘీభావం తెలిపిన నాయకులు



నవతెలంగాణ-జగదేవపూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ ప్రధాని కావాలని కోరుకుంటూ దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట, భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన పాదయాత్ర రెండో రోజు జగదేవ్‌పూర్‌కు చేరుకుంది. జగదేవపూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాచారం డైరెక్టర్ నాగరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్ వారి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని కావాలని ఖాజీపూర్ నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వరకు పాదయాత్ర చేయడం హర్షనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా కెసిఆర్ ప్రధాని అయితే పలు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత ప్రభుత్వాలలో జరగని అభివృద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు.